క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

గంగాధర: మండలంలోని మధురానగర్ చౌరస్తా మైనారిటీ బాలికల గురుకుల విద్యాలయంలో ఐదు, ఏడో తరగతుల్లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జి.వారుణి సూచించారు. ఐదో తరగతిలో ఎస్సీ 3, ఎస్టీ 3 సీట్లు, ఏడో తరగతిలో బీసీలకు రెండు, ఎస్టీలకు ఒక సీటు ఖాళీగా ఉందని, ఈ నెల 28లోపు పాఠశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సన్మానం

జమ్మికుంట: హుజూరాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఇటీవల నియామకమైన ఎండీ సజ్జద్‌ను ఆస్ట్రేలియా న్యూ సౌత్‌వెల్ (ఐఓసీ ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్) రాష్ట్ర అధ్యక్షుడు పంజాల మహేశ్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐలు బుధవారం శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కష్టపడి పనిచేసే వారిని కాంగ్రెస్ పార్టీ గుర్తిస్తుందని, దానిక సజ్జద్ నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ ఎస్వై థామస్, మర్రి మనోజ్‌రెడ్డి, నివాస్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు పరామర్శ

చొప్పదండి: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కాంగ్రెస్ నాయకులు బుధవారం ఆయన నివాసంలో పరామర్శించారు. ఎమ్మెల్యే సతీమణి మృతిపట్ల సంతాపం వ్యక్తం చేసి ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, కట్టికోల లక్ష్మణ్, మాజీ సర్పంచ్ గుంటి మల్లయ్య, సంబోజి సునీల్, మండల లక్ష్మయ్య, కొత్తపల్లి రామకృష్ణ, లింగంపల్లి దేవదాస్, నవీన్, కర్నాకర్, నర్సయ్య, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

బంద్ విజయవంతం

చొప్పదండి: పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశలల బంద్ విజయవంతమైంది. ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని, ప్రైవేట్ స్కూళ్లలో అధిక ఫీజుల వసూలు అరికట్టాలని ఏబీవీపీ పిలుపు మేరకు బుధవారం పాఠశాలల బంద్ నిర్వహించారు.

విద్యార్థులకు బ్యాగులు



స్కూల్ బ్యాగులతో విద్యార్థులు

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉదారం మౌనిక జ్ఞాపకార్థం చిన్నారి తల్లిదండ్రులు బుధవారం స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. మౌనిక పాఠశాల బస్సు కిందపడి మృతి చెందడంతో తల్లిదండ్రులు ఏటా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. కార్యక్రమంలో ఉదారం శ్రీనివాస్, ముత్యాల తిరుపతిరెడ్డి, ఇజ్జగిరి శ్రీనివాస్, బీసవేని రాజశేఖర్, మెండె కొమురయ్య, రామడుగు ప్రశాంత్, మండల శ్రీనివాస్, సన్నీ, ప్రవీణ్, తిరుపతి, హెచ్ఎం వీరేశం, సదానందం, ప్రణీత పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సిర్సపల్లి గ్రామ రైతువేదికలో బుధవారం మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వివిధ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలనుద్దేశించి జిల్లా మహిళ సాధికారిక కేంద్ర జెండర్ స్పెషలిస్ట్ కవిత, ఫైనాన్స్ లిట్రసీ రోహిణి మాట్లాడారు. లింగనిర్ధారణ చట్టరీత్యా నేరమని, ఆడపిల్లలు, మహిళలు, పిల్లలపై జరుగుతున్న లైంగిక వేధింపులపై పనిచేస్తున్న చట్టాలు, సఖీ, 181 సెంటర్ సేవలు వివరించారు. ఆర్థిక అక్షరాస్యత, పొదుపు వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్, ఆశ వర్కర్, వీవోఏ ఉన్నారు.

వారసంతకు వేలం

చొప్పదండి: పట్టణంలో కూరగాయలు, గొర్రెలు, మేకల వారసంతకు బుధవారం వేలం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, కమిషనర్ కీర్తి నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ వేలం ముగ్గురు పాల్గొన్నారు. కొత్తూరి శ్రీనివాస్ వేలం దక్కించుకున్నారు. మున్సిపల్ మేనేజర్ డి. ప్రశాంత్‌కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వనిత

రామడుగు: మండలంలోని వెదిర గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం డబ్ల్యూడబ్ల్యూఎస్-ఇండియా, ఉత్తమ పత్తి యాజమాన్య పథకం, నవక్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. బీసీఐ సంస్థ ప్రతినిధి కె. వనిత మాట్లాడుతూ.. నేల సారవంతం చేసుకోవడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. మంచి దిగుబడికి నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలం.. జాగ్రత్తగా ఉందాం

- విద్యుత్ జాగ్రత్తలు పాటిస్తేనే సురక్షితం
- వినియోగదారుల్లోనూ చైతన్యం తీసుకువస్తున్న అధికారులు



ఇప్పలనర్సింగాపూర్‌లో విద్యుత్ మరమ్మతులు చేస్తున్న అధికారులు(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్: అసలే వర్షాకాలం.. అందులోనూ ఈదురుగాలులు, భారీ వానలు కురిసే సమయాల్లో అప్రమత్తత ఎంతో అవసరం. విద్యుత్ సంస్థ అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నా.. వినియోగదారులు జాగ్రత్తగా ఉంటేనే ప్రమాదాలను నివారించవచ్చు. ప్రజలతో పాటు అధికారులు, సిబ్బంది తగిన జాగ్రత్తలు పాటిస్తేనే సురక్షితం. ఈ విషయంపై సంస్థ అధికారులు ఉద్యోగులు, సిబ్బందికి సూచనలు ఇవ్వడంతో పాటు వినియోగదారుల్లోనూ చైతన్యం తీసుకువస్తున్నారు. నాణ్యమైన ఐఎస్ఐ గుర్తింపు పొందిన విద్యుత్ తీగలను ఏర్పాటు చేసుకోవాలి. నాసిరకం వాటితో కరెంట్ వినియోగం పెరగడంతో పాటు ప్రమాదాలకు అస్కారం ఉంటుంది. తెగిన వైర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసుకోవాలి. గదిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్లు, లైట్లను ఆపివేయడంతోపాటు ఎల్ఈడీ బల్బులు వినియోగించాలి. ఇంటి ఆవరణలో విద్యుత్ ప్రసారం జరిగే ప్రాంతాలకు దూరంగా దుస్తులు ఆరవేయాలి. ఇనుప తీగలను వినియోగిస్తే ప్రమాద అవకాశాలు ఎక్కువ. ఇళ్లలో గాలి, వెలుతురు వచ్చే ప్రాంతాల్లో ఫ్రిజ్‌లు ఏర్పాటు చేసుకోవాలి. ఎవరైనా విద్యుత్ షాక్‌కు గురైతే కరెంటు ప్రసరించని కర్ర లేదా ఇతరత్రా వాటితో రక్షించాలి. నిపుణులతో ఇళ్లలో ఎర్తింగ్ ఏర్పాటు చేసుకోవాలి. స్తంభాలు పడిపోకుండా రక్షణగా ఏర్పాటు చేసిన తీగలను ఎట్టి పరిస్థితుల్లోనూ ముట్టుకోకూడదు. పశువులను వాటికి కట్టివేయకూడదు. విద్యుత్ తీగలు తెగిపడినా, చెట్ల కొమ్మలు తాకి మంటలు వచ్చినా వదులుగా ప్రమాదకరంగా వైర్లు, స్తంభాలు కనిపించిన సంబంధిత అధికారులు, సిబ్బందికి సమాచారం చేరవేయాలి. సర్వీసు వైర్లు వీధి దీపాలు సరిచేసేందుకు ఇతరులు స్తంభాలు ఎక్కకూడదు.

సమస్యలేర్పడితే సమాచారం ఇవ్వాలి

వ్యవసాయ పంపుసెట్లకు మన్నిక కలిగిన కెపాసిటర్లు అమర్చుకోవాలి. ఐఎస్ఐ గుర్తింపు కలిగిన సబ్‌మెర్సిబుల్ పంపుసెట్లు వాడాలి. మోటారు స్టార్టర్లు పైపులను తాకకూడదు. కరెంటు ప్రసారం జరిగే అవకాశం ఉంది. నియంత్రికల వద్ద సమస్య ఏర్పడితే మరమ్మతులు చేయడం, ఆన్‌ఆఫ్ వంటివి చేయకూడదు. ఇబ్బందులు తలెత్తితే విద్యుత్ అధికారులు, సిబ్బందికి సమాచారం చేరవేస్తే వారే వచ్చి పరిష్కరిస్తారు.

అధికారులు, సిబ్బంది పాత్ర కీలకం

ప్రమాదాల నివారణలో విద్యుత్ అధికారులు, సిబ్బంది పాత్ర ముఖ్యమైంది. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యల పరిష్కారం దిశగా ముందుకుసాగాలి. మరమ్మతులను సంబంధిత ఏఈ, సీనియర్ లైన్‌మెన్, లైన్‌మెన్, జేఎల్ఎం పర్యవేక్షణలో చేపట్టాలి. సరఫరా నిలిపివేసిన తర్వాతే పనులు చేయాలి. వదులు తీగలను సరిచేయటం, చెట్ల కొమ్మల తొలగింపు వంటి వాటిని ఎప్పటికప్పుడు చేపట్టాలి. వర్షం కురిసిన సమయంలో ఇనుప స్తంభాలకు కరెంటు సరఫరా అయ్యే అవకాశాలున్నాయి. అనవరమైన చోట వాటిని తొలగించి సిమెంట్‌వి వేయాలి. తక్కువ ఎత్తులో ఉండే నియంత్రికలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిని సరైన ఎత్తులో ఏర్పాటు చేయాలి.

సొంత నిర్ణయాలు వద్దు



వర్షాకాలంలో క్షేత్ర స్థాయిలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా ఆదేశాలు జారీ చేశాం. మరమ్మతుల సమయంలోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించాం. నియంత్రికల వద్ద మరమ్మతుల విషయంలో వినియోగదారులు, రైతులు సొంత నిర్ణయాలు తీసుకోవద్దు.

– మాటూరి వీరాచారి, పెద్దపాపయ్యపల్లి రూరల్ ఏఈ

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

- చెడువ్యసనాలతో భవిష్యత్ నాశనం
- కలెక్టర్ పమేలా సత్పతి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

తిమ్మాపూర్: మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్‌లోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మత్తుకు బానిసై భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని, చదువు, క్రీడల్లో రాణించాలని సూచించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి.శ్రీనివాసరావు, కరీంనగర్ టౌన్ ఏసీపీ గోపతి నరేందర్, శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి, జిల్లా ఇన్‌చారిజ సంక్షేమ అధికారి సబిత, సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ ధనలక్ష్మి, డీఈవో జనార్దన్‌రావు, జిల్లా వైద్యాధికారి సుజాత, తహసీల్దార్ కనకయ్య, సోషల్ వెల్ఫేర్ ఇన్‌చార్జి డీడీ హమీద్, నిషా ముక్తి చైర్మన్ కేశవరెడ్డి, చైతన్య కళాశాల చైర్మన్ రమేశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ జి.వెంకటేశ్వర్లు, ప్రసాద్‌రాజు, ఏ.రామ్‌నరసింహారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

చొప్పదండి: చైతన్య జూనియర్ కళాశాలలో సీఐ ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.

హుజూరాబాద్: యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ సీఐ తాళ్లపల్లి శ్రీనివాస్ అన్నారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని కాకతీయ కళాశాలవిద్యార్థులకు అవగాహన కల్పించారు.

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట జిల్లా పరిషత్తు పాఠశాలలో మత్తు పదార్థాల వల్ల కలిగే ఇబ్బందులను ఎస్సై సురేందర్ వివరించారు.

జమ్మికుంట: పట్టణంలోని గ్రాయత్రి డిగ్రీ, పీజీ కళాశాల, ఐటీఐ కళాశాలలో యాంటీ డ్రగ్స్ డే నిర్వహించారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని టౌన్ సీఐ వరంగంటి రవి అన్నారు.

ఇల్లందకుంట: మండలంలోని టేకుర్తి మోడల్ స్కూల్ విద్యార్థులకు యాంటీడ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ కిషోర్ మాట్లాడుతూ.. డ్రగ్స్ దుష్పరిణామాలు, ఆరోగ్య సమస్యలను వివరించారు. డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు అనుమానం వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

శంకరపట్నం: విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటు కావొద్దని హుజూరాబాద్ రూరల్ సీఐ వెంకటి అన్నారు. కేశవపట్నం మోడల్ స్కూల్‌లో యాంటీ డ్రగ్స్ డే నిర్వహించారు. మత్తుపదార్థాల అనర్థాలను వివరించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ జ్యోతి, ఎస్సై లక్ష్మారెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రోత్ డే

రామడుగు: మండలంలోని వెదిర, వెంకట్రావుపల్లి గ్రామాలల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం గ్రోత్ డే నిర్వహించారు. ఐదేళ్లలోపు చిన్నారుల బరువు, ఎత్తు కొలిచారు. అనంతరం పోషకాహారం ప్రాధాన్యత గుర్చి తెలియజేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు రమేశ్, మహేందర్, అంగన్‌వాడీ టీచర్లు, వైద్యసిబ్బంది, పిల్లల తల్లిదండ్రులున్నారు.

గంగాధర: ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించాలని ఎంపీడీవో దమ్మని రాము అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. మండలంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం ప్రీ స్కూల్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో సౌందర్య, సూపర్‌వైజర్లు సుధారాణి, రమాదేవి, రేణుక,పాల్గొన్నారు.

◆ బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల నాటకాలతో ప్రజలు విసిగిపోయారు

హుజూరాబాద్‌రూరల్: బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల నాటకాలతో నియోజకవర్గ ప్రజలు విసిగిపోయారని బీజేపీ జిల్లా కార్యదర్శి బింగి కరుణాకర్ అన్నారు. మండలంలోని వెంకట్రావ్‌పల్లె గ్రామంలో బుధవారం మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.వందకోట్ల స్కామ్‌కు పాల్పడ్డారంటూ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి రాజకీయ ఉనికి కోసం ఆరోపణలు చేస్తున్నారని, వందరోజుల్లో ఆరు గ్యారెంటీలు పక్కాగా అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను పూర్తి స్థాయిలో నెరవేర్చకుండా మాటలతో కాలం గడుపుతుందన్నారు.

◆ పీచుపల్లికి బస్‌సర్వీస్



చిగురుమామిడి: ఆర్టీసీ బస్సును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం పీచుపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసు మొదలు కాగా టెంకాయ కొట్టి ప్రారంభించారు. ఇరవై ఏళ్లుగా గ్రామానికి బస్సు సౌకర్యంలేక ప్రజ లు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలతో బస్ సర్వీసు వచ్చిందన్నారు. హుస్నాబాద్ నుంచి చిగురుమామిడి, సీతారాంపూర్ స్టేజీ నుంచి పీచుపల్లికి అక్కడి నుంచి చిన్నముల్కనూర్ మీదుగా కరీంనగర్ వెళ్తుందన్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం రెండు ట్రిప్పులు నడుస్తుందన్నారు.


◆ అదృశ్యం కేసు

జమ్మికుంట: ఓ వ్యక్తి అదృశ్యమైనట్టు బాధితుల ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన పులిపాక రాజ్‌కుమార్‌అనారోగ్య సమస్యలతో బాధపడుతుండగా మంగళవారం మండలంలోని బిజిగిరిషరీఫ్ దర్గాకు తీసుకువచ్చారు. అర్ధరాత్రి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోగా భార్య పులిపాక రీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

◆ పరామర్శ

చిగురుమామిడి: బీఆర్ఎస్ రామంచ గ్రామ మహిళా విభాగం అధ్యక్షురాలు సిద్దెంకి సారవ్వ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా ఆమె కూతురు సువర్ణను బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి బుధవారం పరామర్శించారు. ఇల్లు, భూమిలేదని, కూతురు బీఎస్సీ పూర్తి చేసిందని ఆమె తమ్ముడు బీఆర్ఎస్ నాయకుడు సిద్దెంకి రాయమల్లు తెలిపగా సారవ్వ కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని శ్రీహరి భరోసా ఇచ్చారు.

నియామకం




నియమకపత్రం అందిస్తున్న బొంకూరి సురేందర్

జమ్మికుంట: మండలంలోని శంభునిపల్లి గ్రామానికి చెందిన రాసపల్లి సదానందంను హుజూ రాబాద్ నియోజకవర్గ మాదిగ శక్తి అధ్యక్షుడిగా నియమించినట్లు మాదిగ శక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు బొంకూరి సురేందర్ మాదగ తెలిపారు. ఈమేరకు బుధవారం నియామకపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పూర్తి స్థాయి మండల కమిటీలు ఏర్పాటు చేసి, ఆర్థిక, సామాజిక, రాజకీయంగా మాదిగల ఎదుగుదలకు కృషి చేయలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా నాయకుడు శంకరయ్య, తదితరులు ఉన్నారు.

ట్రాక్టర్ యూనియన్ ఎన్నిక

వీణవంక: మండలంలోని కొండపాక గ్రామ ట్రాక్టర్ యూనియన్‌ను బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఈదునూరి పైడికుమార్, ఉపాధ్యక్షుడుగా ఆవాల గిరిబాబు, కార్యదర్శిగా మిరాల శ్రీనివాస్, కోశాధికారిగా దాంట్ల సమ్మయ్య, సహాయ కార్యదర్శిగా ఎలకపెల్లి లింగయ్య, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా రమేశ్ యాదవ్




నూతన అధ్యక్షుడు రమేశ్‌యాదవ్, డైరెక్టర్లు

తిమ్మాపూర్: కరీంనగర్ డెయిరీ మొగిలిపాలెం గ్రామ పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా చెన్నబోయిన రమేశ్‌యాదవ్ ఎన్నికయ్యారు. గ్రామంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో డెయిరీ సభ్యులు రమేశ్‌యాదవ్‌ను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డైరెక్టర్‌గా మోరపల్లి రాజిరెడ్డి ఎన్నికయ్యారు. పాల ఉత్పత్తిదారుల అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రమేశ్ అన్నారు. ఈసందర్భంగా నూతన అధ్యక్షుడితో పాటు డైరెక్టర్‌ను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, మాజీ సర్పంచ్ సుస్మితారెడ్డి, పాల ఉత్పత్తిదారులు అభినందించారు.

రజకసంఘం గ్రామ కమిటీ

శంకరపట్నం: మండలంలోని మెట్‌పల్లి గ్రామ రజక సంఘంను బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాలువ తిరుపతి, ఉపాధ్యక్షుడిగా చంద్రమౌళి, ప్రధానకార్యదర్శిగా శ్రీనివాస్‌ను ఎన్నుకున్నట్లు బాధ్యులు తెలిపారు.

రైతు భరోసా సర్వే ప్రారంభం



గంగాధర: సర్వే నిర్వహిస్తున్న అధికారులు

గంగాధర: సాగు చేసే వ్యవసాయ భూములకే రైతు భరోసా సాయం అందించాలని నిర్ణయించిన కాంగ్రెస్ ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో సర్వేకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని కరీంనగర్, ఖమ్మం, సంగారెడ్డి, హన్మకొండ, కామారెడ్డి జిల్లాలను పైలెట్ ప్రాజెక్టులుగా ఎంపిక చేశారు. మండలంలోని 19 రెవెన్యూ గ్రామాల పరిధిలోని 33 గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు, ఐకేపీ సీసీలు, వ్యవసాయ విస్తరణ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహిస్తున్నారు. మండలంలోని 12,594 సర్వే నంబర్లలోని 2,825 ఎకరాల్లో వ్యవసాయ యోగ్యమైన భూమి ఉన్నప్పటికీ అందులో పంటలు సాగు చేస్తున్నారా లేదా అనే విషయంపై సర్వే నిర్వహించాలి, సర్వేనంబర్లలో ఇండ్లు ఉన్నాయా, లేకుంటే గతంలో ఏమైనా పంటలు సాగు చేశారా, ఇప్పుడు చేస్తున్నారా అనే వివరాలు సేకరిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం వరకు 825 సర్వే నంబర్లలో సర్వే పూర్తయిందని ఐదు రోజుల్లో మొత్తం పూర్తవుతుందని ఎంపీడీవో రాము పేర్కొన్నారు.

రైతు భరోసాకు ఎదురుచూపులే

గన్నేరువరం: గన్నేరువరం మండలంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని నాలుగు క్లస్టర్లల్లో మండల విస్తరణ అధికారులు సౌమ్య, అనూష, ప్రశాంత్, కీర్తిలు గ్రామ పంచాయతీ కార్యదర్శులతో కలిసి సర్వేలో చేపట్టారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఆయా భూములను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. సర్వే పూర్తయ్యే వరకు రైతు భరోసా పథకానికి రైతులకు ఎదురుచూపులు తప్పేలా లేదు.

కేసీఆర్‌ను కలిసిన నాయకులు



కేసీఆర్‌కు వేంకటేశ్వరస్వామి చిత్రపటం అందజేస్తున్న ఎంపీపీ కేతిరెడ్డి వనిత దేవేందర్‌రెడ్డి

తిమ్మాపూర్: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని ఫామ్‌హౌజ్‌లో ఎంపీపీ కేతిరెడ్డి వనిత, రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డితో పాటు ఎంపీటీసీలు మండలంలోని నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీపీ దంపతులు కేసీఆర్‌కు వేంకటేశ్వరస్వామి చిత్రపటం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, పార్టీ మండలాధ్యక్షుడు రమేశ్, వైస్ ఎంపీపీ వీరారెడ్డి నాయకులు జితేందర్‌రెడ్డి, పొన్నం అనిల్, పాశం అశోక్‌రెడ్డి, లక్ష్మణ్, శంకర్, సంపత్, కొమురయ్య ఉన్నారు.

ఘనంగా పెద్దమ్మతల్లి బోనాలు



పెద్దమ్మతల్లి ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న ముదిరాజ్‌లు

ఇల్లందకుంట: మండలంలోని సిరిసేడు గ్రామంలో ముదిరాజులు బుధవారం భక్తిశ్రద్ధలతో పెద్దమ్మతల్లి బోనాలు నిర్వహించారు. ఇంటింటి నుంచి మహిళలు నెత్తిన బోనంతో డప్పుచప్పుళ్ల మధ్య ఆలయానికి ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ నియోజకవర్గ అధ్యక్షుడు జేకే, సిరిసేడు మత్స్య పారిశ్రామిక సహకారం సంఘం అధ్యక్షుడు రెడ్డి సారంగం, ఉపాధ్యక్షుడు పుట్ట రాజు, డైరెక్టర్లు, పుట్ట కుమారస్వామి, పద్మయ్య, చంద్రమౌళి, అశోక్, చిరంజీవి, శివ,రవి, చేరాలు, రాజకొమురయ్య, సాయిలు, రాయమల్లురెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయిప్రతిష్ఠాపన

శంకరపట్నం: మండలంలోని ముత్తారం ఎస్సీకాలనీలో బుధవారం రాత్రి బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజలు చేశారు. కాలనీ మహిళలు మంగళహారులతో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయాలి

జమ్మికుంట: దిగజారుడు రాజకీయాలు మానుకొని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల సందర్భంగా నిలిచిన కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేయాలని జమ్మికుంట జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్‌శ్యామ్ అన్నారు. బుధవారం పట్టణంలో మాట్లాడారు. బూడిద పంచాయితీపై సవాళ్లు విసురుకుంటూ ప్రజా అవసరాలను పట్టించుకోకుండా అయోమయానికి గురిచేస్తూ కాలం వెళ్లదీస్తున్నారని ఆరోపించారు. చెక్కులకు 27వ తేదీ గడువు ముగుస్తుందని గుర్తు చేశారు.సమస్యలు పట్టించుకోకుంటే రానున్న రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు.

ఛత్రపతి సాహు మహరాజ్ జయంతి



సాహు మహరాజ్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని మానవవాద నిలయంలో బుధవారం మానవ వికాస వేదిక, బీఎస్పీ, మిత్ర సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఛత్రపతి సాహు మహరాజ్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాహు మహరాజ్ పోరాటాలు, చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో మానవ వికాస వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రొంటాల బుచ్చయ్య, నాయకులు వెంకన్న, రాంశ్రీనివాస్, బెల్లి రాజయ్య, పల్లె ప్రశాంత్, మారెపెల్లి మొగిలయ్య, మంద సమ్మయ్య, మల్లయ్య, రాం సారయ్య, కొకంటి స్వామి రాజు తదితరులున్నారు.

యువజన కాంగ్రెస్ నాయకుల నిరసన



హుజూరాబాద్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

హుజూరాబాద్: విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం ఆటలాడుతుందని యువజన కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీని నిరసిస్తూ బుధవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద పీఎం నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. నీట్ పరీక్ష అవకతవకలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు జంగ అనిల్, చల్లూరి విష్ణువర్ధన్, ముక్క రవితేజ, అజయ్, సాయి, సంజయ్, రాము పాల్గొన్నారు.

ఎన్‌టీఏలను రద్దు చేయాలి

జమ్మికుంట: నీట్ పేపర్ లీకేజీతో విద్యార్థుల భవిష్యత్‌ను చిన్నాభిన్నం చేస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) కేంద్ర ప్రభుత్రం రద్దు చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి, ప్రధాన కార్యదర్శి తూముల తిరుపతిలు బుధవారం డిమాండ్ చేశారు. ఈసందర్భంగా నీట్ పరీక్ష రద్దు విషయమై తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ పిలుపు మేరకు గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టి కలెక్టర్ ద్వారా గవర్నర్‌కు మెమోరాండం అందజేస్తామన్నారు. అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై నిరసన జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రధాని దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మానకొండూర్: మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ యువజన సంఘం అధ్యక్షుడు కోంద్ర సురేశ్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. నీట్ పరీక్ష అవకతవకలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని నాయకులు సతీశ్, మనోహర్, సాగర్, అజర్, హరీశ్, శేఖర్, కిరణ్ డిమాండ్ చేశారు.